దేవాలయాలే జూదగృహాలుగా మారినప్పుడు, ధర్మకర్తలే దేవాలయ ప్రాంగణంలో అత్యాచారాలు జరపబోయినపుడు - ఈ సమాజం ఏ దిశ వైపు పోతోంది అన్న మీమాంస మనసును కలిచివేయకామానదు. పరిష్కారం తోచకా మానదు.

## అంకురార్పణ

తూర్పు కనుమల మధ్యలో, తూర్పు గోదావరి-విశాఖ జిల్లాల సరిహద్దులో, తాండవ నదికి ఎగువన ఉంది గునుపూడి. నవనాగరికత ఇంకా తొంగి చూడని ఆ ఊళ్లో ఓ పాడుపడిన రామాలయం ఉంది. ఏనాడో పూర్వీకులు ధర్మం నాలుగు పాదాలా నడిచే రోజుల్లో కట్టించారు దాన్ని. చాలా కాలంగా పూజా పునస్కారాలు లేక బూజు పట్టిన సీతారామ లక్ష్మణుల విగ్రహాలూ, తోక విరిగి, గద నేల పాలయినా భక్తితో ధ్యానముద్రలో కూర్చున్న హనుమాన్లూ, కిలంపట్టి మసిబారిపోయిన భజన చెట్టూ, ఓనాటి ఆలయ ప్రతిష్ఠను చెప్పక చెప్పుతూంటాయి.

ఆ రోజులు వేరు! భగవంతుడంటే భయం, భక్తీ ఉన్న ప్రజలుండేవారు. నిత్య పూజలు జరిపించే ధర్మకర్తలుండేవారు. అవన్నీ ఇప్పుడు పోయాయి. ఆ విగ్రహాల్ని ఈ మధ్యనే తూర్పు వైపు కటకటాల గదిలోకి నెట్టేసి, గది తలుపులు తాళాలతో బంధించేశారు ఆ ఊరి వాళ్లు. ఒకనాడు పండగొచ్చినా, పబ్బమొచ్చినా రామాలయ మండపం భజనల్తో, భక్తులతో కిటకిటలాడుతూ ఉండేది. ఇప్పుడూ ఆ మండపం మనుష్యులతో కిటకిట లాడుతోంది. కాని భక్తులతో కాదు. చీట్ల పేకాడే బృందాలతోనూ, చీకటి తప్పుల కోసం కాసుక్కూచునే వారితోనూ! ఒక్కమాటలో చెప్పాలంటే ఒకప్పుడు నీతి నియమాలకి ఆటపట్టులయిన గ్రామాల్లో అవినీతి, అధర్మం, అరాజకత్వం నెమ్మది నెమ్మదిగా చోటు చేసుకుంటున్నాయి. గునుపూడి కూడా ఆ ప్రభావాలకి లొంగిపోయిందనే అనుకోవాలి. లేకపోతే రామాలయం పరిస్థితి ఇలా దిగజారిపోయి ఉండేది కాదు.

రోజూలాగే ఆ రోజు కూడా సాయంత్రం రామాలయ మండపంలో రమ్మీ రంజుగా సాగుతోంది. ఇంతలో డప్పు వాయించుకుంటూ నారిగాడూ, వెనకాలే బాణా కర్ర పుచ్చుకుని పాండవులూ దగ్గరే ఉన్న గ్రామ కంఠంలోకి వచ్చారు. అక్కడ నిలబడి నారిగాడు డప్పు వాయించడం ఆపు చేశాడు. పాండవులు, పెద్ద గొంతుతో దండోరా విషయం ఇలా చెప్పాడు:

"గునుపూడి పెజలు యావన్మందికీ తెలియజేయడమేమనగా, రేపు పొద్దున్నే సర్కారు లోన్లు వసూలు చేయటానికి గవురుమెంటు ఆఫీసర్లు ఒత్తన్నారు. కనక ఎవరు కట్టవలసిన బాకీలు వారు కట్టవలసింది. కట్టని వోరికి కఠిన సిచ్చ వేసి, జైల్లో పెడతా రంటహో!"

రమ్మీ ఆడుతున్న బృందంలో 'నాయుడు' ధ్యానం కొంచెం ఇటు మళ్లించి వెటకారంగా అన్నాడు.

"టముకేత్తన్నారండి! టముకు! ఏటి? లోను వసూలవుద్దనే?!"

"ఏం బట్టికెల్తారు? ఆళ్ల మొహం, ఒకడికేనా లోను డబ్బు పూర్తిగా ముట్ట జెబుతేగందా! సగానికి సగం మామూల్లకే సాలదు. చేతికొచ్చిన డబ్బు ఏం కొనడానికి చాలదు. గోచీకి పెద్దా, గావంచాకి కురచా అన్నట్టు. ఏం మాఁవా? నీకూ ఉన్నట్టుందిగా 'ఎడ్ల లోను'! తీరుత్తావేటి?" అన్నాడు సత్యనారాయణ అప్పన్నని ఉద్దేశిస్తూ.

"సీ!సీ! అందికే సీక్వెన్సు లేని ఆట ఆడగూడదంటారు" అని చేతిలో ఉన్న పేక నేల మీద పడేసి, "ఏమంటావూ? లోను సంగతా? అసలుఎడ్లని కొంటే గదా! తోలడానికి, లోను తీర్చడానికీనూ! రొండు వేలకి ఏలు ముద్రేయించుకుని, ఆళ్ల మామూళ్లు కోసుకుని ఎయ్యి సేతిలో ఎట్టారు. దానికి నడిచే ఎడ్లు ఎలాగూ రావుగదా అని రమ్మీలో పెట్టేసరికి, ఆ ఎయ్యికీ ఎప్పుడో కాళ్లొచ్చేసేయి" అన్నాడు అప్పన్న.

"అద్గదీ! అప్పన్నది మిడిల్‌డ్రాపు అన్నమాట" అని చెన్నయ్య శెట్టి, "అయితే బావా! మరి ఎడ్లని కొనకపోతే ఆళ్లూరు కోరుగందా? ఏంజేశా?" అని ప్రశ్నించాడు.

"దానికేం పెద్ద బెమ్మాండం? పేటలో మా బామ్మర్ది కాడ కాడెడ్లున్నాయి. ఆటిని తోలు కొచ్చి సూపించా! ఇయ్యే కొన్న ఎడ్లని!" రహస్యం బైటపెట్టాడు అప్పన్న.

"అద్సరే! మరి లోను తీర్చడం సంగతి ఏం ఆలోచించావేటి?" అని అడ్డుగా ప్రశ్నించాడు నాయుడు.

"సూద్దాం లేవో! దానికీ ఏదో మసిబూసి మారేడు కాయ చేయాల. రేప్పొద్దున్నదాకా టైమున్నదిగందా!" ధీమాగా అన్నాడు అప్పన్న.

"సూడు! సూడు! గవురుమెంటు డబ్బు! తిరిగియ్యకపోతే బొక్కలో తోసేత్తారు. రమ్మీలో నాకు అరువెట్టి, ఎగ్గొట్టేసినట్టుగాదు. దానికి లెక్కా పత్రం ఉంటాయి. అమ్మ! జోకరొచ్చింది. ఓకులు లెక్కట్టండయ్యా, ఆటయింది" అన్నాడు చెన్నయ్య శెట్టి.

"సీకటడింది. రంగులు బాగా ఆనడం లేదు. ఇహ మానేయడం మంచిది" అన్నాడు గోపాలం.

"ఇదుగో! పంతులూ! నీకీ కుళ్లు బుద్ధే పోయింది గాదు. సరిగ్గా చెయ్యి రైజులో ఉన్నప్పుడు ఆట మూయించేస్తావు." గుర్రున చూస్తూ అన్నాడు శెట్టి.

"పోనీండయ్యా! పంతులు కసలే రేచీకటి. ఇయ్యాల్టికి కట్టేద్దాం!" అని లేచాడు నాయుడు. రమ్మీలో నాయుడు మాటంటే, జిల్లా కోర్టు తీర్పు లాంటిదే! తిరుగు లేదు.

అంతవరకూ నాయుడి ఎడం కాలు పట్టుతూ వారి మాటలు నిశ్శబ్దంగా వింటూన్న రాజప్పకి చీకట్లో ఎర్రని వేడి చురక తగిలినట్టూక సంగతి జ్ఞప్తికి వచ్చింది. వెంటనే లేచి, తుండుగుడ్డ దులిపి భుజాన వేసుకుని, పరుగులాంటి నడకతో ఇల్లు చేరాడు.

* * *

రొప్పుకుంటూ ఇంటికొచ్చిన భర్తని చూసి బెంబేలెత్తిపోయి, "ఏం మాఁవా? ఏటయింది?" అని ఆదుర్దాగా అడిగింది, గంగి.

"ఏఁవీ లేదుగానీ, ఆ మద్దెన అందరికీ లోను లొచ్చినపుడు మానవూఁ ఏలిముద్దర్లేసేం గందా!?" అని అడిగాడు రాజప్ప.

"మనవూఁ...అంటే? నువ్వొక్కడివే ఏసేవు. 'జాగర్త మావాఁ! నువ్వసలే అమాయకుడివి' అంటే గూడా ఇనిపిచ్చుకోలేదు. అయినా ఇప్పుడా వూసెందుకు? ఏటయింది?" అని ఎదురు ప్రశ్న వేసింది గంగి.

"పర్లేదులేవే! నువ్వు బయపడకు. రంగనాథం బాబు బగవంతుడిలాటోరు. మనల్ని అన్నేయం జెయ్యరు. ఆయనెయ్యమంటే నేగందా ఏలి ముద్రేసేను! ఆ పాపం, పున్నెం ఆయనే జూసుకుంటారు" అన్నాడు రాజప్ప.

"నువ్వేటేటో మాటాడుతున్నావు. ఆసలేం జరిగిందో చెప్పు మాఁవాఁ?" రెట్టించి అడిగింది గంగి.

"ఏఁవీ లేదే! పెబుత్వంకాడ తీసుకున్న అప్పు రేపు కట్టకపోతే జైల్లో పెట్టేత్తారంట! ఏలిముద్రంటే నేనేసేనుగాని, ఆ డబ్బేటో, ఎంతుచ్చుకున్నాడో, ఏం జేసేడో, అంతా ఆ రంగనాదం బాబుకే తెలుసు. నువ్వుండు, నేనెల్లి అడిగొత్తాను" అని విసురుగా గుడిసె దాటి చీకటిగా ఉన్న వీధిగుండా, ఆ ఊళ్లో కల్లా పెద్దమేడ వైపు వెళ్లాడు.

"ఉండు మాఁవాఁ! నేనూ వొత్తన్నా!" అంటూ వెనకాలే పరుగెత్తింది గంగి.

* * *

అప్పుడే రాత్రి భోజనం పూర్తి చేసి, తీరిగ్గా ఇంటి ముందు సిమ్మెంటు గట్టు మీద కూర్చుని చుట్టపొగని ఆనందిస్తున్నాడు రంగనాథం. అదాటుగా వచ్చిన రాజప్పని చూసి అతడు విస్తుపోలేదు. సాయంత్రం వేసిన దండోరా విషయం అందరికీ తెలుసు. అయినా అడగాలిగదా అని, "ఏరా!! ఇలా వచ్చావు?" అని అడిగాడు, హరికేన్ లైటు కాంతిలో, వెనకాలే వచ్చిన గంగిని ఓ కంట కనిపెడుతూ!

"సాయింత్రం టముకు ఏయించారు కదా బాబయ్యా! రేపు లోను డబ్బు కట్టాలంట," అన్నాడు రాజప్ప భయంగా.

"అయితే ఏంటట?" మోకాలు మీద మోచెయ్యి ఆన్చి, చుట్ట రెండు వేళ్ల మధ్య పెట్టి ఉంగరపు వేలుతో నుసిని దులుపుతూ, ఆ వెచ్చదనాన్ని అనుభవిస్తూ, అడిగాడు రంగనాథం.

"రేపది కట్టకపోతే జైలేనంటున్నారండి!" రాజప్ప కంఠం వణికింది.

"సర్లేరా! అర్థాంతరంగా వచ్చి ఇప్పుడు డబ్బంటే ఎట్టా? రేపటి కేదో తంటాలు పడు. తరవాత చూద్దాం!" రంగనాథం ధీమాగా అన్నాడు.

"దరమ పెబువులు! తఁవరే అలాగంటే, నేనేమైపోవాల? అసలా డబ్బేటో, లోనేటో నాకేం తెలుసు? అదంతా మీరే జూసుకున్నారు. నే నేలిముద్రేసేను! అంతే!" ఒంచిన నడుమెత్తకుండా అన్నాడు రాజప్ప.

"అవునురా! నేనేం కాదన్నానా? నీ డబ్బు ఎగ్గొట్టేస్తానా? రేపటికి అనువుగాదంటున్నా నంతే!" రంగనాథం అన్నాడు.

"నన్ను పోలీసులట్టుకుపోతే నా కుటుంబం ఏం గావాల? ఏ రోజు కూలి ఆ రోజుకే చాలని వాళ్లం. నా పెళ్లానికి గంజెవరు పోస్తారు? తఁవరే ఏదో దారి సూపించాల!" దీనంగా వేడుకున్నాడు రాజప్ప.

"జైలంటే అంత భయమెందుకురా! అక్కడ రెండు పూటలా తిండి బెడతారు నీకు. ఇక నీ పెళ్లామంటావా? మేమంతాలేమా? ఊరా? అడివా? నువ్వు జైలు నుంచి తిరిగొచ్చిందాకా దానికేదో ఉపాధి చూపిస్తాలే! అయినా ఆ విషయం రేపు జూసుకుందాం! అర్ధరాత్రప్పుడు నా నెత్తి మీద ఎక్కి కూచుంటే ఎలా? వెళ్లు! ఇంటికెళ్లు!" అని విసుగ్గా లేచి నుంచున్నాడు రంగనాథం. ఇక వివాదం అనవసరం అన్నట్టుగా!

అంతవరకూ పులీ, మేకా మధ్య సంభాషణ వింటున్న గంగిగోవులా నిస్సహాయంగా నిలబడిన గంగికి ఒంట్లో రక్తం కుతకుత ఉడికిపోతోంది. తన భర్త జైలు ప్రాప్తినుంచి కాపాడమని వేడుకుంటుంటే, నిమ్మకు నీరెత్తినట్టు నిశ్శబ్దంగా జవాబిస్తున్న యజమానిని చూసి గంగి మనసులో అసహ్యం పుట్టుకొచ్చింది."రా! మాఁవాఁ! ఎల్దాం! నీ కిక్కడ నాయం దొరకదు!" అని రాజప్ప చేయి పుట్టుకుని నడిపించుకు వెళ్లిపోయింది.

మర్నాడు ఆఫీసర్లు పోలీసులతో సహా వచ్చి డబ్బు కట్టని వారిని భయపెట్టి బెదిరించి నానా రభసాచేశారు. రాజప్ప వంటి అమాయకుల్ని బేడీలు వేసి తీసికెళ్లిపోయారు కూడా! పోలీసు జీపులో వెళ్లిపోతున్న రాజప్పని చూసి, గంగి గుడ్లనిండా నీరు కక్కుకుని, "నువ్వు చెయ్యనినేరానికి నీకు సిచ్చెందుకు పడాలి మాఁవాఁ!" అని వాపోయింది. సాయంత్రానికి అంతా చల్లబడిపోయింది. ఊరు మాటు మణిగింది.

* * *

వారం తిరక్కుండానే, ఓ సాయంత్రం రంగనాథం మనిషొచ్చి, 'రమ్మంటున్నా'రని గంగిని తీసికెళ్లాడు. గంగితో, "ఏమే! ఒంటరిగా ఇంట్లో పడిఉండకపోతే, మా ఇంట్లో పశువుల

కొట్టాం బాగుచేసి, దంపుళ్ల సావిడి తుడిచీ, అటు రామాలయం బాగుచేసీ కాలం గడప కూడదూ? రామాలయానికి ధర్మకర్తలం మేమే కదా! నీ కష్టం ఉంచుకోం. ఏదో కొంత ముట్ట జెప్పుతాంలే! ఈ రోజు నుంచే పని మొదలు పెట్టు" అని గంగి అంగీకారం కోసం ఎదురుచూడ కుండానే ఆజ్ఞాపించాడు. ప్రక్కనే నిలబడిఉన్న పనివాడితో, "నువ్వెళ్లరా! అది పన్జ్జాసుకు వస్తుంది" అని వాడిని పంపించేశాడు రంగనాథం.

చీపురు కట్ట తీసుకుని దంపుళ్ల సావిడిలోకి వెళ్లింది గంగి. సావిడి శుభ్రం చేసేసరికి చీకటి పడసాగింది. రంగనాథమిచ్చిన తాళాలతో రామాలయంలోని కటకటాల గది తలుపులు తెరిచి ఆ గదిని శుభ్రం చేస్తున్న సమయంలో వెనకాలే వచ్చాడు రంగనాథం. గంగి గతుక్కుమంది.

"కంగారెందుకే? కొరుక్కుతినేస్తానా ఏమిటి? నువ్వు 'ఊc' అను. నీ యింట్లో బంగారం నింపేస్తాను" అని పులిలా మీద బడబోయాడు. కట్టుకొ్రున ఉన్న గోవులా గజగజలాడింది గంగి. అయినా గుండె దిటవు చేసుకుని ఒడుపుగా తప్పించుకుంది. తొక్కుళ్లాటలో సీత విగ్రహపు కాలు తగిలి దఢాల్న క్రిందపడ్డాడు కామాంధుడు రంగనాథం. పడిపోబోయి, నిలద్రొక్కుకున్న గంగి చేతికి, సగం విరిగిన హనుమంతుడి గద దొరికింది. ఆ క్షణంలో రంగనాథం ప్రాణాలు ఆమె చేతిలో ఉన్నాయి. చేతికొద్దీ, గదతో, మెడ మీద ఒక దెబ్బ చాలు. కానీ స్త్రీ సహజమైన దయాగుణం ఆమె చేత ఆ పని చేయించలేకపోయింది 'ఛీ! ఛీ! దుర్మార్గుడు!' అనుకుని చేతిలోని గద నేల మీద విసిరేసి, 'తాడు తెంచుకు పరుగెత్తే' ఆవులా రామాయలంలోంచి బైటపడి తన గుడిసె వైపు దూసుకుపోయింది. కలతపడిన హృదయంతో నులక మంచంపై బడి ఆలోచించసాగింది గంగి.

* * *

ఎంతటి దుర్మార్గానికి తెగించాడు రంగనాథం? తన భర్త రాజప్ప ఇలాంటి దౌర్జన్యం రంగనాథం భార్యపై చేయగలడా? కనీసం ఊహించగలడా? దీనికి కారణం ఏమిటి? సంఘం నిర్మించిన ఉచ్ఛనీచాలేనా ఈ చొరవకి కారణం? అయితే నైతికంగా వాడు తన కంటే ఎన్ని మెట్లు క్రిందనున్నాడు? అది నీచం కాదా? ఎంతకాలం బలహీనుల్ని బలవంతులిలా కాల్చుకుతింటారు? ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి? కొద్దిక్షణాల క్రితం రంగనాథం తన చేతుల్లో చచ్చిఉంటే?! అక్కడితో సమస్య తీరదు. నేలనాలికిన ప్రతి రక్తపు బిందువు మరొక రంగనాథమై పుట్టుకొస్తుంది. అందుకే వాడిని చంపాలనిపించలేదు. దీనికొక్కటే పరిష్కారం కనిపిస్తోంది. సంఘం దృష్టిలో వాడికన్న ఔన్నత్యాన్ని సాధించాలి. వాడి కంట్లో కన్ను పెట్టి చూడగల ఎత్తులకి మేమూ ఎదగాలి. ఓ పెద్ద గీతని చిన్న గీత చేయాలంటే దానిని చెరపడం కాదు. దాని ప్రక్కన పెద్ద గీత గీసి అదెంత చిన్నదో దానిచేతనే గుర్తింపజేయాలి. నైతికమైన ఔన్నత్యం సంస్కారంతో ముడిపడి ఉంటుంది. ఈ రెండింటి సాధనకీ, మనసుకి అదుపులో పెట్టుకునే మానవ ప్రయత్నం ఆసరాగా ఉండాలి. సంఘం దృష్టిలో ఎదగడానికి, తలుచుకుంటే అదెంత ఘనకార్యమనికానీ, ఎవరో వచ్చి ఉద్ధరిస్తారని

కానీ అనుకొని కూర్చోవడం భావ్యం కాదు. ఈరోజే...ఇప్పుడే దానికి అంకురార్పణ జరగాలి. ఫలితాన్ని తన జీవిత కాలంలో తన కళ్లతో తాను చూడకపోవచ్చు. కాని తాను నాటిన విత్తు వృక్షమై దాని ఫలాలు ఇపుడు తన కడుపులో ఎదుగుతున్న మాం(వ ప్రతిరూపం తింటే అది తన ఆత్మకి తృప్తి కాదా?!!!

ఇలా ఆలోచిస్తూన్న గంగిని, 'కేరు కేరు' మని ఏడిచి అలిసిపోయిన చంటిపాపని లాలించిన అమ్మలా తన ఒడిలోకి తీసుకుంది నిద్రాదేవి నెమ్మదిగా.

తూరుపు తెల్లవారింది. గంగి మనసులోని స్థిర నిశ్చయంలా కొండల మధ్య నుంచి ఎర్రని సూర్యబింబం క్రమంగా ఆకాశంలోకి ఎగబ్రాకుతోంది. ✷